## క్లుప్తంగా...

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పీ.హాతీరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పర్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. ఫోర్ట్‌వ్యూ కాలనీ, నాయుడుకాలనీ, న్యూఫ్రెండ్స్ కాలనీ, సన్‌రైజ్ హోమ్స్, సాయిభవానీ, జనచైతన్య ఫేస్–1,2,3, గోల్డెన్ హైట్స్, అశోక్ విహార్ కాలనీ, చింతల్‌మెట్, పరమారెడ్డి హిల్స్, సహారా హోమ్స్, జలాల్ బాబానగర్, నౌనెంబర్, మహమూదాబాద్, ఉప్పర్‌పల్లి కోర్టు, ఆర్టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

### రోడ్డు ప్రమాద స్థలాన్ని సందర్శించిన సీపీ



సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్

**బండ్లగూడ:** కార్పొరేషన్ పరిధి సన్‌సిటీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కూతురు చనిపోయిన ఘటనా స్థలాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్ సందర్శించారు. ట్రాఫిక్ లేని సమయంలో వాహనాల స్పీడ్ నియంత్రణ గురించి బుధవారం సీఐలకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ హనుమంతారావు సీఐలు మధుసూదన్ రెడ్డి, కృష్ణ ఉన్నారు.

### సన్మానం



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**రాజేంద్రనగర్:** బీజేపీ సీనియర్ నేత వై.శ్రీధర్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా బీజేపీ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. బుధవారం డివిజన్ బీజేపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డివిజన్ మహిళా మోర్చా కమిటీ సభ్యులు ఆయనను కలిసి సత్కరించారు. డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శులు స్వప్నరెడ్డి, కవిత, ఉపాధ్యక్షురాలు రమాదేవి, బీజేపీ కార్యదర్శి రామేశ్వరి తదితరులున్నారు.

### పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు



ఆర్.టీ ఇలాంగోను సన్మానిస్తున్న జిల్లా బీజేపీ కార్యదర్శి కొమురయ్య

**అత్తాపూర్:** బీజేపీ కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని అత్తాపూర్ డివిజన్ స్వల్పకాలిక విస్తారక్ ఆర్.టీ.ఇలాంగో అన్నారు. డివిజన్‌లో స్వల్పకాలిక విస్తారక్‌గా విధులు నిర్వహించుకుని స్వగ్రామానికి బయలుదేరిన ఆర్.టి.ఇలాంగోను జిల్లా బీజేపీ కార్యదర్శి మొండ్ర కొమురయ్య ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఇలాంగో మాట్లాడుతూ.. అత్తాపూర్ డివిజన్ శక్తికేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రమేష్, సుధాకర్, సాయియాదవ్, రాంగోపాల్, శ్రీరాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

**మణికొండ:** అనుమానాస్పద స్థితిలో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుప్పాలగూడ బృందావన్ అపార్ట్‌మెంట్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. రాజశేఖర్‌రెడ్డి కూతురు శ్రేయారెడ్డి (28) మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో భోజనాల అనంతరం నిద్రకు ఉపక్రమించింది. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో పెంపుడు కుక్క అరవడంతో మేల్కొన్న రాజశేఖర్ రెడ్డి..కూతురు శ్రేయారెడ్డి రూమ్‌కు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె తెల్లవారుజామున మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# హత్య కేసులో నిందితుల రిమాండ్



మహ్మద్ ఉస్మాన్



మహ్మద్ యూసుఫ్



రిజ్వాన్



మహ్మద్ షఫీ



మహ్మద్ మసూద్‌ఖాన్



మహ్మద్ సల్మాన్

**అత్తాపూర్:** స్నేహితుడిపై కక్ష పెంచుకున్న పాత నేరస్తులు పథకం ప్రకారం హత్య చేసి పారిపోయారు. పోలీసులు దుండగులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ ప్రాంతానికి సయ్యద్ ఉస్మాన్ (31) డ్రైవర్, చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన రిజ్వాన్(23) వ్యాపారం చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ షఫీ(26), కార్వాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాన్(27), చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన సల్మాన్(23) సీలింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఉస్మాన్ సైబరాబాద్, రాచకొండ పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులతో పాటు హత్యకేసుల్లో నిందితుడు. గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖలీల్‌ఉల్లా(29) ఉస్మాన్‌కు సన్నిహితంగా ఉంటున్నాడు. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో ఖలీల్‌ఉల్లాను చంపేందుకు కుట్రపన్నారు. ఈ నెల 1న టోలీచౌకీ ఆర్టీఓ ఆఫీస్ ప్రాంతంలో కుట్రచేసిన నిందితులు చింతల్‌మెట్ వద్ద హత్య చేసేందుకు పథకం పన్నారు. దీనిలో భాగంగానే మద్యం సేవించేందుకు ఖలీల్‌ఉల్లాను పిలిపించారు. అతిగా మద్యం తాగించి కాళ్లు, చేతులు కట్టేసి హత్య చేసి పారిపోయారు. ఖలీల్ ఉల్లా సోదరుడు షేక్ ఉల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అత్తాపూర్ పోలీసులు హత్య చేసిన నిందితులను రిమాండ్‌కు తరలించారు.

**మరో ఘటనలో ఇద్దరు..**

**రాజేంద్రనగర్:** తన సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడన్న కక్షతో తన స్నేహితులతో కలిసి హత్య చేసిన ఇద్దరు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. ఎంఎంపహాడీ ప్రాంతానికి చెందిన ఆజామ్‌అలీ(22), ముజాయిద్(21), బాకర్(21) స్నేహితులు. కాగా ఆజామ్‌అలీ, ముజాయిద్‌లు నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల ప్రాంతాల్లో జరిగిన వాహనాల దొంగతనాల కేసుల్లో నిందితులు. వీరిపై పలు కేసులు నమోదై ఉన్నాయి. రెండు నెలల క్రితమే ఇరువురు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఆజామ్‌అలీ, ముజాయిద్‌కు సంబంధించిన వివరాలను పోలీసులకు చెబుతున్నాడనే నెపంతో ఇద్దరు గొడవ పడ్డారు. దీనితో పాటు వీరి ఇద్దరి మధ్య ఆర్థిక చోరీ సొత్తు పంచుకునే విషయంలో గొడవలు జరిగాయి. ఆదివారం రాత్రి ముజాయిద్ తన స్నేహితుడు బాకర్‌తో కలిసి ఆజామ్‌అలీని ఫోన్ చేసి రప్పించాడు. ఓ వెంచర్‌లోని ఖాళీ ప్రదేశానికి వెళ్లి మద్యం సేవించారు. అనంతరం ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ముజాయిద్ తన వద్ద ఉన్న కత్తితో ఆజామ్‌అలీపై దాడి చేయడంతో పాటు బండరాయితో మోదీ హత్య చేశాడు. ఈ హత్యకు బాకర్ సైతం సహకరించాడు. ఆజామ్‌అలీ మృతి చెందాడని నిర్ధారించుకున్న అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బుధవారం శాస్త్రీపురం వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**శంషాబాద్ రూరల్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రషీద్‌గూడ, పోశెట్టిగూడలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధితో సమానంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. పనుల నాణ్యతపై ఎలాంటి రాజీలేకుండా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రూ.1,22,00,000లతో గ్రామంలో పంచాయతీ భవనం, బీటీ రోడ్డు మరమ్మతులు, మురుగు కాలువ పనులు, సీసీరోడ్డు, పోశెట్టిగూడలో డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ రాణిరవి, ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, సొసైటీ చైర్మన్ దొనాకర్‌గౌడ్, డైరెక్టర్ మోహన్‌రావు, ఉపసర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ధనపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# దశలవారీగా ప్రజా సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

**బండ్లగూడ:** ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని దశలవారీగా పరిష్కరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం హిమాయత్‌సాగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోనాల పండుగ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమస్యలపై ప్రజలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. రోడ్లపై పాట్‌హోల్స్ లేకుండా ప్యాచ్‌వర్క్‌లను పూర్తి చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో ఆటంకం కలగకుండా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ మేనేజర్ నారాయణ, వాటర్ బోర్డు మేనేజర్ నరేందర్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, రవీందర్ రెడ్డి, సాగర్‌గౌడ్, రాము, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, నాయకులు రాజిరెడ్డి, పాపయ్యయాదవ్ తదితరులున్నారు.

**మేయర్ పర్యటన...**

కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన అనంతరం మేయర్ మహేందర్‌గౌడ్ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పలు కాలనీల్లో పర్యటించారు. జలమండలి జనరల్ మేనేజర్‌తో కలిసి యాదవమిత్రకాలనీ, బ్యాంక్ కాలనీ, గాయత్రీనగర్‌లలో పర్యటించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

## ప్రజలకు ఇబ్బందిలేకుండా రోడ్డు మరమ్మతులు



ప్యాచ్‌వర్క్‌ను పరిశీలిస్తున్న కౌన్సిలర్, ఏఈలు

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై ఉన్న గోతులను వెంటనే పూడ్చి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని 8వ వార్డు కౌన్సిలర్ ఎ.నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం తన వార్డు పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో రోడ్లపై ఏర్పడిన గోతులను ప్యాచ్‌వర్క్‌లు చేపట్టి పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదే తరహాలో తన వార్డుతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధానరోడ్లపై గోతులు ఉన్నాయని వాటిని వెంటనే పూడ్చివేయాలని సూచించారు. వర్షాకాలంలో వాహనదారులు గుంతలను గుర్తించకుండా ప్రమాదాల భారినపడే అవకాశం ఉందన్నారు. ఏఈ సాయిమౌనిక తదితరులున్నారు.

## నేడు థీమ్‌పార్క్ ప్రారంభం

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ డివిజన్ గోల్డెన్ హైట్స్ కాలనీలో థీమ్‌పార్క్‌కు నేడు శంకుస్థాపన చేయనున్నట్లు డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోరెడ్డి ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్‌లు ప్రకటించారు. గురువారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ హాజరవుతారని సమాచారం.

## మరమ్మతుల కారణంగా ..

**రాజేంద్రనగర్:** కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ శాస్త్రీపురం ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి 1.30 వరకు నూర్‌కాలనీ, రిజ్వాన్ కాలనీ, కింగ్స్ కాలనీ, కింగ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాస్త్రీపురం, ఓవైసి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పర్యవేక్షణ కరువు.. !



ప్రేమావతిపేట్‌లో రాత్రి సమయంలో రోడ్డు పనులు

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు రాత్రివేళ పనులు జరుగుతున్నా.. పర్యవేక్షించడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రేమావతిపేట్‌లో సీసీరోడ్డు పనులు జరుగుతున్నాయి. గుత్తేదారు పనులు నాణ్యతతో చేపట్టడంలేదని స్థానికులు వాపోతున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రజలు చెప్పిన విధంగా రోడ్డు నిర్మించాలని సూచించినా.. కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



పోలీస్‌అకాడమీ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ

**బండ్లగూడ:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని పెండింగ్ ఛలాన్లు చెల్లించని వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ మాట్లాడుతూ.. వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలను నడపవద్దని సూచించారు. లైసెన్స్, హెల్మెట్, సీట్ బెల్ట్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# ఈటలకు శుభాకాంక్షల వెల్లువ



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

**శంషాబాద్ రూరల్:** బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను బుధవారం ఆ పార్టీ జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిషోర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కో–కన్వీనర్ ప్రశాంత్, పార్టీ పార్లమెంట్ మాజీ కన్వీనర్ మధుసూదన్ గుప్తా, సోషల్ మీడియా కన్వీనర్ మల్లేష్, నాయకులు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్:** తెలంగాణ బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈటలకు పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

**మణికొండ:** బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను జిల్లా బీజేపీ నాయకులు కలిసి సన్మానించారు. బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జాతీయ యువజన అధ్యక్షుడికి స్వాగతం



**శంషాబాద్ రూరల్:** సిద్దిపేటలో నిర్వహిస్తున్న యువ పోరాట యాత్రకు ముఖ్య అతిథిగా వచ్చిన యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ.శ్రీనివాస్‌కు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ సురభి, జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్విమింగ్‌పూల్‌లో పడి...

**మణికొండ:** ఆడుకుంటూ ప్రమాదవశాస్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడి ఓ చిన్నారి మతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుప్పాలగూడ ప్రాంతానికి చెందిన రవి తన కుటుంబ సభ్యులతో హాల్‌మార్క్ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో రవి కుమారుడు దేవాన్ష్ (5) తోటి పిల్లలతో స్విమ్మింగ్ పూల్ ప్రాంతంలో ఆడుకుంటున్నాడు. ప్రమాదవశాస్తూ స్విమ్మింగ్ పూల్‌లో పడడంతో పిల్లలు విషయాన్ని ఇంట్లో ఉన్న రవికి తెలిపారు. హుటాహుటిన వచ్చిన రవి కుమారుడిని తీసుకొని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు కోసం ఎమ్మెల్యేకు వినతి

**రాయదుర్గం:** రోడ్డు నిర్మాణం కోసం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ బృందం బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిశారు. గోపన్‌పల్లి నుంచి ఉస్మాన్‌నగర్ వరకు బీటీ లేదా సీసీ రోడ్డు వేయించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించి రూ.20 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారని కాలనీవాసులు తెలిపారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణీశ్వర ఆధ్వర్యంలో పలు కాలనీలవాసుల బృందం కలిశారు. ఈ ప్రాంతంలో 2వేల మంది నివాసముంటున్నారని, రోడ్డు గుంతల మయంగా మారి నిత్యం ఇక్కట్లు పడుతున్నామని వారు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సైబర్ అర్బానియా, ముప్పా ఇంద్రప్రస్థ, సాన్సియా విల్లాస్, బొన్సాల్ అర్బర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



మహమూద్‌నగర్‌లో పర్యటిస్తున్న జలమండలి అధికారులు

**రాజేంద్రనగర్:** తాగునీటిలో కలుషిత నీటి సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మజ్లిస్ పార్టీ మహమూద్‌నగర్, హసన్‌నగర్ ప్రైమరీ యూనిట్ అధ్యక్షుడు మహ్మద్ జహంగీర్ అన్నారు. సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుందని బుధవారం మిరాలం డివిజన్–1 జలమండలి మేనేజర్ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ నర్సింగ్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో నెలకొన్న నీటి ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజలు నీటిని వృథాగా చేయవద్దని సూచించారు. తాగునీటిలో కలుషిత నీరు కలవకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త పైపులైన్‌లు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు ప్రకటించారు. మహ్మద్ మన్సూర్, మహ్మద్ ఇక్బాల్, సిద్ధిఖ్‌అహ్మద్, మహ్మద్ ముక్రా, మహ్మద్ తాహేర్, బహదూర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి కృషి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ సభ్యులు

**అత్తాపూర్:** దేవాలయాలను అభివృద్ధి చేసుకునేందుకు సొసైటీ సభ్యులంతా ముందుకు రావడం అభినందనీయమని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ సభ్యులు అన్నారు. బుధవారం రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో సొసైటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు తీర్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 75 నుంచి 4 వరకు ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ 30 ఏళ్ల క్రితం ప్లాట్లుగా చేసి విక్రయించిందన్నారు. హౌసింగ్ సొసైటీ అభివృద్ధిలో భాగంగా స్థానికంగా దేవాలయంతో పాటు పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పి.శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, జోగి శ్రీను, శంకర్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, పాండు, మధు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కారులో మంటలు.. తప్పిన ప్రమాదం

**శంషాబాద్ రూరల్:** కారులో మంటలు వ్యాపించగా.. త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన తొండుపల్లి ఔటర్ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంగర్‌హౌజ్‌కు చెందిన పి.సురేందర్‌రెడ్డి షాద్‌నగర్ వైపు నుంచి శంషాబాద్ వస్తుండగా.. తొండుపల్లి ఔటర్ జంక్షన్ వద్దకు రాగానే కారులో అకస్మాతుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు

**శంషాబాద్ రూరల్:** అసోసియేషన్ పేరుతో మాజీ సర్పంచ్ మల్కారం పంచాయతీ పరిధిలోని గ్రామకంఠం భూమిలో ప్లాట్లను అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ.. సర్పంచ్ మాధవీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్కారం మాజీ సర్పంచ్ గ్రామంలోని గ్రామకంఠం భూమిలో సుమారు 40 ప్లాట్లను మందగాళ్ల కాలనీ అసోసియేషన్ పేరుతో అమ్ముకుంటున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. గ్రామ కంఠం భూమిపై ఎలాంటి అధికారం లేకున్నా మోసపూరితంగా అమ్ముకుంటూ గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారన్నారు. పోలీసులు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.



## కోకాపేట్‌లో యువకుడి ఆత్మహత్య

**మణికొండ:** చదువు పూర్తిచేసుకుని ఉద్యోగ వేటలో ఉన్న ఓ యువకుడు తన గదిలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేట్‌కు చెందిన ముంగి ప్రభాకర్‌రెడ్డి కుమారుడు మనీష్‌రెడ్డి(23) రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి తన గదిలో నిద్రకు ఉపక్రమించాడు. ఉదయం గది నుంచి బయటకు రాకపోవటం అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు తలుపులు తొలగించి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. హుటాహుటీనా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో లారీ డ్రైవర్..**

**రాజేంద్రనగర్:** ఆర్థిక ఇబ్బందులతో పాటు ఉద్యోగం లేకపోవడంతో ఓ లారీ డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టెపల్లి ప్రాంతానికి చెందిన సయ్యద్ హుస్సేన్(34) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ.. తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండు నెలల నుంచి ఉద్యోగానికి వెళ్లడం లేదు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం సాయంత్రం మద్యం తాగొచ్చిన హుస్సేన్ ఇంట్లోకి వెళ్లి నిద్రకు ఉపక్రమించాడు. బుధవారం ఉదయం భార్య గదిలోకి వెళ్లి చూడగా ఉరి వేసుకోని కనిపించాడు. దీంతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అదృశ్యం



అనురాధ (ఫైల్)

**శంషాబాద్ రూరల్:** ఓ మహిళ అదృశ్యమైన ఘటన మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని తుల్జాపూర్ ప్రాంతానికి చెందిన ఏ.పాండురంగ, ఏ.అనురాధ(18) దంపతులు పట్టణంలోని కాపుగడ్డలో నివాసం ఉంటున్నారు. జూన్ 28న పెద్దమ్మ ఇంటికి వెళ్తున్నట్లు చెప్పిన ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం భర్త ఆర్జీఐఏ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

**మరో ఘటనలో యువతి..**

**శంషాబాద్ రూరల్:** బంధువుల వద్దకు వెళ్తున్నట్లు ఇంటి నుంచి బయలుదేరిన యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోల్కొండకు చెందిన గోరి అనూష (21) శంషాబాద్ పట్టణంలోని కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. కాగా సెలవుల కారణంగా ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో మైలార్‌దేవ్‌పల్లిలో ఉంటున్న మేనత్త ఇంటికి వెళ్తున్నట్లు ఈనెల 3న పెద్దగోల్కొండ నుంచి బయలుదేరి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.